వెడల్పుతో క్రిందికి వంచిన మంగళూరు పెంకుల వసారా మూలంగా వర్షంనుంచి రక్షణ లభించే అవకాశం బొత్తిగా కనిపించటంలేదు. అలాంటి తలచాటును నమ్ముకున్నందుకు ప్రతిఫలంగా విశ్వపతిగూడా నాలాగే తడిసి ముద్దయిపోయి ఉండటమే అందుకు ప్రబలమైన సాక్ష్యం. చుట్టజుట్టి తలుపు కానించివున్న అతడి పరుపు మరునాటి ఎండకు తేమ తీసుకుంటేగాని వినియోగపడే స్థితిలోలేదు.

రన్నింగ్ కామెంట్రీ మాత్రం నిరాటంకంగా సాగిపోతోంది:

"భగవంతు డెంత కరుణామయుడండీ రంగనాథంగారూ! చంద్ర నిప్పుల్లాంటి మండుటెండల్ని చెరిగిపోశాడా, ఇదిగో ఇప్పుడిలా చల్లగా వాన కురిపిస్తున్నాడు. గుంటూరు మండుటెండల్లో కాగిపోయి వచ్చానేమో, నాకిప్పుడు పన్నీటి కొళాయిక్రింద నిల్చున్నంత హాయిగావుంది. ఐనా వానంటే ఎందుకిలా భయపడి చస్తారండీ మనుషులు? తడిస్తే మొలకబోరుకదా! నగానట్రా, డబ్బూదస్కంలాంటివి పదిలంగా ఉండటానికని ఇళ్ళు కట్టుకున్నారుబో, కట్టుకుంటే మాత్రం నాలుగు గోడలమధ్య ఖైదీల్లా పడి ఉండవలసిన దురవస్థ మన కేమొచ్చింది? అందుకనే నేనింట్లో పడుకుని రెండేళ్ళయింది. జడివాన గానివ్వండి, చలిగాలి కానివ్వండి - రాత్రుల్లో ఈ పంచను వదలిపెట్టడంలేదు...."

వాన జోరు కాస్త తగ్గింది. ఒకరకమైన వర్షంనుంచీ తప్పించుకో గోరి, మరొకరకమైన వర్షంలోకి వచ్చిపడినందుకు నన్ను నేనే నిందించుకున్నాను. సరిగ్గా ఆ సమయానికి పంచె పైకెగగట్టి, గొడుగు చేతబట్టుకుని, వర్షాన్ని లెక్కపెట్టని ధీమాతో నిటారుగా నడిచివస్తున్న మునిసిపల్ కౌన్సిలర్ శ్రీనివాసులు అల్లంత దూరంలో కనిపించాడు.

"వెళ్ళిపోకండి శ్రీనివాసులుగారూ! గొడుగు క్రింద నాకు కాస్త చోటుచేస్తే మీకు పుణ్యముంటుంది" అన్నాను.

"గొడుక్కేం భాగ్యం? ప్రక్క వీథిలోనే మా ఇల్లు. అవసరమైతే గొడుగే తీసుకెళ్ళి రేపు పంపుదురుగాని. రండి రండి........"
అన్నాడు శ్రీనివాసులు.

విశ్వపతితో 'వెళ్ళొస్తా'నని చెప్పి గొడుగు క్రిందికి చేరుకున్నాను.

"ఏమంటున్నాడు విశ్వపతి?" పది బారలదూరం వెళ్ళాక అడిగాడు శ్రీనివాసులు.

"మరేంలేదు. వాన కురిసినా, గాలి వీచినా తా నింట్లో పడుకోడట! అదొక వ్రతంలా వీధి పంచలోనే పడుకుంటాడట!"

"అలాగా!" బిగ్గరగా నవ్వసాగాడు శ్రీనివాసులు.

"ఏమండీ! ఎందుకు నవ్వుతున్నారు?" కుతూహలంతో అడిగాను.

"ఎందుకంటే రంగనాథంగారూ! మునుపటి కెవరో మహానుభావుడుట ఆడగాలి సోకని ప్రపంచంలోనైతే తాను ఆజన్మాంతం బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించగలనన్నాడట! విశ్వపతివాదం అంతకంటే సహేతుకంగా లేదు. నిగ్రహంతో కోరికల్ని అదుపులో పెట్టుకోడం శ్రేష్ఠమైన పద్ధతి. అలాకాకుండా గాలికిపోయిన పేలపిండి కృష్ణార్పణమనుకోడం ఇంకోపద్ధతి. ఇంట్లో పడుకోడానికి బొత్తిగా వీల్లేకపోతే, పాపం, విశ్వపతిమాత్రం ఏంచేస్తాడు?"

"వీల్లేదా! ఎందుకని? ఏమిటండీ, ఈ చిదంబర రహస్యం?" విస్మయంతో ప్రశ్నించాను.

"రంగనాథంగారూ! కొన్ని విషయాలకు విపులంగా వ్యాఖ్యానాలు అనవసరం! ముక్తసరిగా లఘుటీకలే చాలు! ఈనాడు ప్రపంచాన్నంతా ఎదుర్కొంటున్న సజీవమైన సమస్య జనాభా పెరుగుదల. దాన్ని నిరోధించడానికి పెద్దలు సూచించిన పద్ధతి—అదే ఆత్మనిగ్రహం - ఇప్పుడెవరికీ నచ్చదు. అబ్బదు గూడా! శస్త్రవైద్యమే శరణ్యమని ప్రభుత్వాలు హితోపదేశం చేస్తున్నాయి. అది మధ్యేమార్గం. విశ్వపతి విషయంలో అమలు జరుగుతున్నదే మూడో పద్ధతి"....ముగించాడు శ్రీనివాసులు. ★

కథా నిలయం
శ్రీకాకుళం

# 6

# పట్నం మామయ్య

వచ్చాడు.

వచ్చాడు.

పట్నం మామయ్య వచ్చాడన్న వార్త నిమిషాల్లో వూరంతటా వ్యాపించింది.

మారేడు పల్లె కుగ్రామం. మారుమూల గ్రామం కూడా! తాలూకాపటంలో దాని వూసే కనిపించదు. తుమ్మల్లో గ్రుంకిపోతున్న ప్రొద్దులా అది అడవుల్లో నిద్రపోతున్న పల్లెటూరు.

ఆ పల్లెకూ, పట్టణానికీ వున్న ఒకే ఒక లంకె పట్నం మామయ్య.

కోటబురుజుపై నిల్చున్న కాపలా సిపాయి మిత్రుడైన ఓ మహారాజు ఆగమనాన్ని గమనించినవాడై, వెనువెంటనే నగరంలోకి పరతెంచివచ్చి శుభవార్తను పురజనులకందరికీ చాటిచెప్పి స్వాగత సత్కారాలకు సన్నాహాలు చేయించడం ఎలాంటిది? సరిగ్గా అలాగే పట్నం మామయ్య రోడ్డులో బస్సు దిగాడన్న వార్త చీకి పొదలగుట్టలో మేకలు మేపుకుంటున్న అంజిగాడిద్వారా మారేడుపల్లికి తెలిసింది. మంచులో తడిసిన తర్వాత నీ రెండలో నిగనిగ లాడుతున్న అడవి పువ్వుల్లా బడిపిల్లల ముఖాలు విప్పారిపోయాయి. పంతులు రామజోగి ముఖం పండు గుమ్మడి పువ్వులా కలకల లాడిపోయింది. ఇక

పుల్లమ్మ సంతోషానికి పట్టపగ్గాలే లేవు. గుమ్మపాల పైన నురగలు కట్టినట్టుగా ఆవిడ ముఖాన ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది. సంబరంలో కాలొకచోట నిలవక యింటి ముంగిటికి, వీధి వాకిటికి అదే పనిగా చెడతిరిగేస్తోంది రాజమ్మ. కొంత అతిశయోక్తికూడా మిళాయించి చెప్పుకోవాలంటే పట్నం మామయ్య రాబోతున్నాడనగా మారేడుపల్లెలో చెట్లుగూడా చిగురిస్తాయి. పిట్టలు పాడుతాయి. వెదురు జొంపాల్లోనుంచి వస్తున్న గాలి సవ్వడి పల్లెపైన ఆనందాల బావుటా రెప రెప లాడినట్టుగా వినిపిస్తుంది. ఎటొచ్చీ ఆ వూరికంతా పట్నం మామయ్య రాకను కంటగించుకునేవా డొక్కడే! వాడి పేరు చిట్టిబాబు.

చిట్టిబాబుకు వాడి భాషా ప్రపంచంలో కర్ణకఠోరమైన పలుకొక్కటే!—పట్నం మామయ్య అనేది. కళ్ళకు కనిపించడందాకా ఎందుకు, ఆయన కలలో కనిపించినా వాడికి జడుపే! వాడి దృష్టిలో మారేడుపల్లి ముందు నిత్యభోగాలకు నిలయమైన స్వర్గలోకం బలాదూరు. కాని ఎంతవరకు? పట్నం మామయ్య నీడ దానిపైన పడేంత వరకు! పడిన తర్వాత వాడి కా వూరువిడిచి ఏ కొండ కోనల్లోకో పారిపోవాలనిపిస్తుంది.

సరే. ఇంకా ఉపోద్ఘాతాలెందుకు! పట్నం మామయ్య రానే వచ్చాడు.

నట్టింట సిరిచాప వేసింది పుల్లమ్మ. లేత కొబ్బరికాయ కొట్టించి ఎల నీరు సిద్ధంచేసింది. "అమ్మగోరు కులాసాగా వున్నారా బాబూ! కళ్ళల్లో మెదిలినట్టుండారు. ఓసారి పిల్చుకరాగూడదూ" అంటూ పరామర్శించింది.

పుల్లమ్మ మాటలు పట్నం మామయ్య చెవిదాకా ప్రాకినట్టే లేవు. ఆయన పరధ్యానంగా వున్నారు. ఆయన కళ్ళు దేనికొరకో గాలిస్తున్నాయి.

పరేంగితాన్ని పసిగట్టలేనిదేమీగాదు పుల్లమ్మ. "చిట్టిబాబు కోసమేనా బాబూ! ఉన్నాడు.ఇక్కడే ఎక్కడో వున్నాడు. మీరొచ్చారు గదా! ఒల్లమాలినంత సిగ్గూ, బిడియమూ వాడికి!"

అంతలో పెరట్లోంచి రాజమ్మ కంఠం వినిపించింది.

"నీళ్ళు కాగాయే అమ్మా! అన్నగారు స్నానం చేస్తారేమో అడుగు."

"మిగిలిన పిల్ల లేం చేస్తున్నారు?" పెదవి కదిపాడు పట్నం మామయ్య.

పుల్లమ్మ జవాబు చెప్పింది: "పెద్ద పిల్లకాయ లిద్దరూ వాళ్ళ నాన్నతోనే వెళ్ళి మేస్త్రీపని నేర్చుకుంటున్నారు. మూడోవాణ్ణి మేన మామ పెంచుకుంటున్నాడు. పోగా యిద్దరాడబిడ్డలు, చిట్టిబాబు, చంటి బిడ్డ యింటి దగ్గరే వున్నారు."

పట్నం మామయ్య చొక్కా తీసి చీలకు తగిలించి స్నానం చేయడంకోసం పెరట్లోకి వెళ్ళాడు.

ఆ పాటికి వీధి గుమ్మం దగ్గర పిల్లల హడావిడి ప్రారంభ మైంది.

పుల్లమ్మ కుర్రవాళ్ళపైన విరుచుకపడింది. "అప్పుడే మీ రామందాడి ఆరంభమైందిట్రా కుర్రకుంకలూ! మామయ్య యిప్పుడే వచ్చారు. స్నానం, భోజనం అయ్యాక కాసేపు కునుకు దీసిన తర్వాత గానీ బయటికిరారు. వెళ్ళండి. వెళ్ళండి."

నిజమే మరి! వందమైళ్ళ దూరం బస్సులో రావడమైంది గదా! పాపం, పట్నం మామయ్య బాగా అలసిపోయి వుంటాడు. కాసేపు ఆయన్ను హాయిగా విశ్రాంతి తీసుకోనివ్వడమే మంచిది—అను కున్నట్టుగా పిల్లలందరూ దూరంగా మారేడు తోపులోకి వెళ్ళి పోయారు.

పట్నం మామయ్య స్నానంచేశాడు. భోజనమూ ముగించాడు. పడుకుని ఓ కునుకు దీశాడు. ఆయన నిద్ర లేవడమూ, 'పట్నం బాబుగా రొచ్చారటగా' అంటూ రామజోగిగారు లోపలికి రావడమూ ఒక్కసారే జరిగాయి.

"రండి రండి మేష్టరుగారూ! ఈ దఫా మీకు పది పలాల నస్యం డబ్బీ తీసుకొచ్చాను...."

"మరచిపోతారా బాబూ! ఎముకలేని చేయా మరేమన్నానా! ఆశించిన వాళ్ళ అదృష్టం బాగుండాలేగాని, మీ కెంతయినా యివ్వాలనే వుంటుంది...."

చిటికతో చిటికెడు నస్యాన్ని నాసికలోకి దట్టించారు రామ జోగిగారు.

"ఏమిటోలెండి జగన్నాథంగారూ! అంగ వంగ కళింగ అంటూ యాభైయారు దేశా లుండేవట. మా వూరుంది చూచారూ, ఇది యాభై యేడోదేశం. మిగిలిన ప్రపంచం ఏమైపోతోందో మాకు తెలియదు. మీ రొస్తే ఆ పాపం పుణ్యం కాస్తా చెవిలో వేసుకోవచ్చునని ఆశ. చెప్పండి బాబూ! జనాలేమంటున్నారు? దొరతనం ఏం చేస్తోంది? పత్రికల వాళ్ళు ఏం రాస్తున్నారు?"

ఏదో ఉబుసు పోక కలా అడగడమేగాని ప్రపంచంయొక్క భవిష్యత్తుపట్ల రామజోగిగారికున్న శ్రద్ధగూడా అంతంత మాత్రమే! తన వీధిబడి, తన పొడుం డబ్బీ పదిలంగావుంటే మిగిలిన లోకంతో అక్కర లే దాయనకు! జగన్నాథంగారి ప్రసంగం యింకా తొలి మజి లీకి చేరుకోక మునుపే ఆయన సెలవు తీసుకోడానికి ఉద్యుక్తు డయ్యాడు.

"మళ్ళీ సాయంకాలం కలుసుకుంటానండీ జగన్నాథంగారూ! మీరొచ్చారు కనుక ఈ పూట బడి కెలాగూ సెలవే! నాకూ పాపన్న పేట దాకా వెళ్ళి రావలసిన పనుంది...."

రామజోగిగారు వెళ్ళిపోయాక జగన్నాథంగారు చొక్కా వేసు కుని వూరిబయటకు బయల్దేరారు. అప్పటికి మారేడు తోపులో శివాలయం ఎదుట పిల్లల హంగామా తారస్థాయిలో వుంది. ఊరి పొలిమేరల్లో జగన్నాథంగారు కనిపించగానే ఒక్క పరుగుతో ఎదు రుగావచ్చి పిల్లలందరూ ఆయన్ను చుట్టు ముట్టేశారు.

—"నా కో కలం తెచ్చిపెడతా నన్నావుగా మామయ్యా!"

—"తేరగా వస్తుందట్రా కలం? కథలపోటీలో గెలిస్తేనే కలం! అంతేనా మామయ్యా?"

—"మరైతే ఆటల్లో పందాలుండవా మామయ్యా! పరుగు పందెంలో నైతే మనమే ఫస్టు...."

అందరినీ సర్ది వరుసగా కూర్చోబెట్టారు జగన్నాథంగారు.

"అబ్బాయిలూ! అమ్మాయిలూ! శ్రద్ధగా వినాలిమీరు! అల్లరి చేయకుండా ఎవరికొచ్చిన విద్యను వాళ్ళు చూపెట్టాలి. వాళ్ళ వాళ్ళ తాహత్తు ననుసరించి అందరికీ బహుమానాలుంటాయి. మొదట ఆడ పిల్లలు పాటలు పాడాలి. ఏదీ అమ్మాయ్! నువ్వు పాడు చూద్దాం."

జగన్నాథంగారు ఎన్నికచేసిన ఎర్రటి పెదవుల బుడ్డమూతి అమ్మాయి - ఆరేళ్లుంటాయేమో! - లేచి నిల్చుని, కళ్ళు మూసుకుని ముకుళిత హస్తురాలై మొదలెట్టింది—

"చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ
బంగారు మొలత్రాడు, పట్టుదట్టి.... ...."

'బాగుంది బాగుంది' అంటూ చేతులుతట్టి జగన్నాథంగారు బిడ్డను ఒడిలోకి తీసుకున్నారు.

"బాగా చెప్పావమ్మాయ్! నీ పేరేమిటి?"

ఆ చిన్నపిల్ల సిగ్గుతో మల్లెమొగ్గలా ముడుచుకపోయి పరికిణీలో ముఖం దాచుకుంది.

"పద్యం చెప్పడానికి లేనిసిగ్గు పేరు చెప్పడాని కొచ్చిందన్న మాట! పోనీలే, అసలు పేరు చెప్పకపోతే నిన్ను జ్ఞప్తిలో వుంచుకోడంకోసం నేనే ఓ పేరు పెట్టుకుంటాను. బొద్దుగా ముద్దుగా వున్నావు గనుక గోదాదేవి అని పిలవనా అమ్మాయ్!"

"గోదాదేవి! గోదాదేవి!" పిల్లలు గొంతు కలిపి హర్షధ్వానాలు చేశారు.

"ఊరుకోండర్రా వూరుకోండి. గోదాదేవి పద్యం చక్కగా చెప్పింది గనుక ఆమెకో చిన్న పౌడరు డబ్బీ యిద్దామనుకుంటున్నాను...."

"ఏదీ, ఎక్కడుంది మామయ్యా! చూపించవూ?"

"బహుమతు లిక్కడెందుకుంటాయి? ఇక్కడ పోటీలు,

బహుమతుల నిర్ణయాలు మాత్రమే! సాయంకాలం యింటి దగ్గర ఎవరి బహుమతులు వాళ్లు తీసుకోవచ్చు...."

"అలాగలాగే! మరిప్పుడు నేను పాడనా మామయ్యా!"

"ఉండుండు. పేర్లు వ్రాసుకోకపోతే నేను మరచిపోయినా మరచిపోగలను. మొట్టమొదట గోదాదేవి—'చేత వెన్నముద్ద' చెప్పి నందుకు ఒక చిన్న పౌడరు డబ్బీ. తరువాత, నీ పేరేమిటమ్మాయ్! వద్దొద్దు—అసలు పేరెందుకు, నేనే నామకరణం చేసుకుంటాను. పాడు...."

"సముద్ర తీరము పోతిమి-చాలాసేపు వుంటిమి
సోముడెంతో గుండ్రముగా-సొగసు వెన్నెల కాయగా...."

విహారానికి సముద్రతీరాన్ని వలచిన ఆ అమ్మాయికి సాగర కన్య అని పేరు పెట్టారు జగన్నాథంగారు. ఓ బొమ్మల పుస్తకం బహుమతిగా ప్రకటించారు.

పాటలు పాడడం ముగిసిన తర్వాత ఓ కుర్రవాడు హరిదాసులా అభినయిస్తూ కుచేలోపాఖ్యానం చెప్పాడు. వాడిపేరు నారాయణ అని జగన్నాథంగారు మునుపే ఎరుగుదురు. అన్వర్థ నామధేయంగా వుంది పోనిమ్మని వాడిని ఆదిభట్ల నారాయణదా సంటూ వీపు చరిచి "ఇలాగే సాధన చేస్తుండరా అబ్బీ! నీ కో మంచి తంబూరా తెచ్చి పెడతాను" అన్నారు.

పాటలు, కథలు ముగిసిన తర్వాత ఆటల్లో పందాలు జరిగాయి. నడిమింటి భీమన్న అనే కుర్రవాడు చాంపియన్‌గా ఎన్నికయ్యాడు. మల్ల యుద్ధ వీరులు ధరించే మాదిరిగా ఓ చేతుల్లేని బనీను వాడికి బహుమతిగా ప్రకటింప బడింది.

ప్రొద్దుపోయి చీకటిపడుతుండగా పుల్లమ్మ పూరింటి ఎదుట పాఠశాల వార్షికోత్సవం లాంటి తతంగం జరిగింది. సూట్‌కేసు నిండుగా తీసుకొచ్చిన వస్తువు లన్నింటినీ జగన్నాథం గారు పిల్లలకు పంచి పెట్టేశారు.కానైతే పెట్టెలో అట్టడుగున దట్టమైన ప్యాకింగులో ఆయన పదిలంగా తీసుకొచ్చిన క్రొత్త బట్టలు కొన్ని,వాటికి తోడుగా

ఓ పుస్తకాల సంచీ, బుల్లి పేనా ఒకటి, ఒక చిన్న టార్చి లైటు యివి మాత్రం అలాగే మిగిలివుండిపోయాయి.

అవన్నీ చిట్టి బాబుకు!

ఏడీ, ఎక్కడున్నాడు చిట్టిబాబు?

వాడు ఆటల్లో లేడు. పాటల్లోలేడు. ఆనంద లోకాలకు ప్రతి నిధుల్లాగా వీధుల్లో గంతులువేస్తూ, కేరింతలు కొడుతున్న బాలబాలిక ల్లోనూ వాడు లేడు.

ఏమయ్యాడు చిట్టిబాబు?

అది జగన్నాధం గారి కొక్కరికి మాత్రమే ఎదురైన ప్రశ్న గాదు. తల్లి రాజమ్మను, అమ్మమ్మ పుల్లమ్మను సూటిగానే కాదు-శూలపు పోటులాగా ఎదుర్కొంటున్న ప్రశ్న గూడా అదే!

పుల్లమ్మ ముఖాన నెత్తురు చుక్కలేదు.వెదక వలసిన చోట్లన్నీ వెదకి రాజమ్మ ఉసూరుమని నిట్టూర్చుకుంటూ వచ్చి పెరట్లో కూర్చుంది.ఎంతగా వాళ్ళు దాచిపెట్టుకోవాలన్నా, అసలు విషయం జగ న్నాథంగారు వూహించలేని దేమీగాదు.

"చిట్టిబాబు కనిపించడం లేదా ఏమిటి?" ఆయన వీలైనంత నిర్వికారంగానే ప్రశ్నించారు.

"ఆ. ఎక్కడికి వెళ్తాడు? దొంగ వెధవ! ఏ తడిక చాటునో నక్కి కూచుని వుంటాడు. ఇక్కడ వీడి నాన్న వీడికోసం రొక్క రోజనాలు రాసి పోసి వుంచినట్టు. అందుకని మన సొప్పక మరెవరో వీణ్ణి దేశాంత్రం పంపించేస్తున్నట్టు! అదృష్టం భూములేలమంటే బుద్ధి గాడిదల్ని కాయమనడం యిదేనేమో మరి!"

వేడిగా నిట్టూర్చారు జగన్నాధంగారు. ప్రొద్దుపోయి బాగా చీకటి పడిపోతున్న సమయం. పూరి కొంపల్లోనుంచి గుడ్డి దీపాల కాంతి వీధిగుమ్మాలవరకైనా ప్రసరిస్తున్నట్టులేదు. మానవ జీవి తంలో ఆశాలేశాలకు మల్లే గగనంలో మినుకు మినుకుమంటున్న చుక్కలకేసి చూస్తూ జగన్నాథంగారు అరుగుపైన కూర్చున్నారు.

అడవిలో ఓ పల్లెటూరు. ఆ పల్లెలో ఒక పూరింటి అరుగు పైన దిగులుతో క్రుంగిపోయి కూర్చున్న ఓ నడి వయస్సు మనిషి!

ఆయనే జగన్నాథం గారంటే జగన్నాథంగారిని గురించి తెలిసిన వాళ్ళెవరూ నమ్మరు.

నగరంలో జగన్నాథంగారికి రెండంతస్తుల మేడలు నాలు గున్నాయి. ఒకటి రెండు భారీ వ్యాపారాల్లో వాటా లున్నాయి.పిలిస్తే పలికే దాసదాసీజనమున్నార్ను. సహ ధర్మిణి పార్వతమ్మ నిలుపులో, నిదానంలో నిండు కుండ. ప్రశాంత మహా సాగరంలా నిండుగా, నిరుపమానంగా కనిపించే జీవితమే ఆయనది.కాని నిలకడగా కనిపించే కడలి లోతుల్లో బడబానలంలా పరీక్షించి చూసినవారికి జగన్నాథంగారి జీవితంలో తీరని కొరత ఒకటి కనిపించనే కనిపిస్తుంది.

ఆ కొరతా, అందు మూలంగా ఏర్పడిన ఓ ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురైన ఓ సంఘటన-ఇవి మూడూ మూడు కారణాలై జగన్నాథంగారికీ, మారేడు పల్లికీ ఓ తీరని అనుబంధాన్ని కల్పించాయి.

ఆ వున్న కొరత జగన్నాథంగారి నొక్కరిని మాత్రమే గాదు. చరిత్రలో దశరథుడు, మృకండుడు, శుద్ధోదనుడు మొదలైన సుప్ర సిద్ధుల్ని గూడా ఎదుర్కొన్నదే! అనపత్యత. పుత్రులు లేని వారికి గతులులేవు! పరంలో నైతే పున్నామ నరకం; ఇహంలో ఉక్కు ముక్కు కాకుల్లా ఈసడించి పారవేసే లోకులు.

ఏడేళ్ళకు మునుపటి సంగతి: మ్రొక్కిన వరమీని చిల్లర వేల్పుల్ని రోసి, న్యాయంకోసం సుప్రీం కోర్టుకు వెళ్ళినట్టుగా వరం కోసం వడ్డికాసుల వాడి సన్నిధానానికి వెళ్ళి సతీసమేతంగా తిరిగొస్తు న్నారు జగన్నాథంగారు. ఎవరి మొక్కుబడిని వాళ్ళు రహస్యంగా వుంచుకో దలచుకున్న మాట నిజమే! కాని పార్వతమ్మే మొదట బయట బడింది. "ఏమండీ! సంతానం కలిగితే బంగారంతో బిడ్డలాగా బొమ్మచేయించి హుండీలో వేసేటట్టు మ్రొక్కుకున్నాను.ఏమంటారు? సరేనా...." అంటూ ఆమె భర్తఅంగీకారంకోసం అర్థించింది.

జగన్నాథంగారు మాత్రం మౌనంగానే కూచున్నారు. తమ మ్రొక్కుబడి భగవంతుడి మన్ననకు పాత్రం కావాలంతేగానీ, ఆయనకు తాము మ్రొక్కుబడి చెల్లించడ మేమంత విశేషంగాదు.

ఐనా సంపద మాత్రం ఎవరిది? అదీ భగవత్ప్రసాదితమే! ఆయన సొమ్మును ఆయనకివ్వడంలో తన కే మభ్యంతర ముంటుంది?

ఎటొచ్చీ అర్థాంగి కోరిక నెరవేరితే తన కంతే చాలు—

ఆలోచనలో అన్యమనస్కులై కూర్చున్నారు జగన్నాథం గారు! బస్సు పరుగెడుతోంది. కనుచూపుమేరకు పచ్చగా కనిపిస్తున్న చిట్టడివి. చల్లగా గాలి. అంతకన్నా చల్లగా తారురోడ్డు పైన జారి పోతున్న బస్సులో జగన్నాథంగారికి చిన్నగా ఓ కునుకు పట్టింది.

"లేవండి, లేవండి" అన్న కేకలతో వులికిపడి కళ్ళు తెరిచారు జగన్నాథంగారు. ఆ పాటికే బస్సు యించుమించు నిర్జనంగా వుంది. పల్లెగాని, పేటగాని కనిపించని అరణ్య ప్రాంతంలో బస్సాగిపోవడానికి కారణమేమిటో స్ఫురించక అటూ యిటూ పరకాయించి చూస్తున్న జగన్నాథంగారిని కండక్టరు బలవంతాన క్రిందికి దింపించాడు. ఏమిటీ, ఏమైందంటూ కంగారుగా పార్వతమ్మ కోసం వెదుక్కుంటున్నారు జగన్నాథంగారు. వాకబు చేయగా విషయం తెలిసింది. అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ నవమాసాల గర్భిణికి బస్సులోనే కడుపు నొప్పులు ప్రారంభమయ్యాయి.

పరుగెడుతున్న బస్సు అనుకోని అవాంతరంవల్ల మార్గ మధ్యంలో ఆగిపోతే ప్రయాణీకుల పాలిటికి కాలచక్రమే ఆగిపోయిన ట్టనిపిస్తుంది. అలా అనిపించడ మెందుకని వితర్కించుకుంటున్నారు జగన్నాథంగారు. కదలిక ప్రాణికి పుట్టుకతో వచ్చిన గుణం, శారీరకం గానూ, మానసికంగానూ స్తబ్ధత ఎప్పుడైతే ఏర్పడుతుందో అదే జీవికి తుది క్షణం. ఆ రెంటికీ మధ్యనున్నదే జీవితం. జీవితం స్రవంతిలా కదలిపోతుంటేనే జీవికి ఆనందం. అందుకు విరుద్ధంగా నిల్వనీటిలా స్తంభించిపోతే, యిదిగో యిలాగే విషాదం!

ప్రేక్షకు లెంతోసేపు వేచి కూర్చున్న తర్వాత తెర పైకి లేచి నట్టుగా, చుట్టూరా నెలకొన్న స్తబ్ధత ఒక్క క్షణంలో పటాపంచలైంది. క్రొత్త నాటకానికి ఉపక్రమణిక లాగా పసికందు కెవ్వు కెవ్వున ఏడవడం వినిపించింది.

"ఏమండోయ్! ఎవరైనా ఓ చాకిలా పడేస్తారూ! ఎవరి దగ్గ

రుంది? బొడ్డుకోయడానికి చాకు కావాలి...." అత్యవసర పరిస్థితుల్లో మంత్రసాని పాత్రకు తోడ్పడుతున్నాడు కండక్టరు.

జగన్నాథంగారి పెదవులపైన ఓ చిరునవ్వు విరిసింది.

"మీలో మీరే నవ్వుకుంటున్నారేమండీ! దేన్ని చూచి?" సమీపిస్తూ అడిగింది పార్వతమ్మ.

"జగన్నాటకాన్ని చూచి!"

కాని లోకవృత్తంలో నాటకీయతను గమనించేపాటి ఓపిక పార్వతమ్మకు లేదు. ఆమె తన ధోరణిలో తాను చెప్పుక పోతోంది. "ఎంత బాగున్నాడండీ! మగబిడ్డ. పనసపండులాగున్నాడు. ఇది నాలుగో కాన్పట. మూడో కాన్పు తల్లి ప్రాణంమీది కొచ్చిందట! ఇప్పుడేమౌతుందో నని యిలా ఆసుపత్రికి బయల్దేరారు. ఏమంత కలిగిన వాళ్ళలా కనిపించరు. అడిగితే బిడ్డను పెంపకానికి యిచ్చే ట్టే వున్నారు. అడగరాదుటండీ?"

జగన్నాథంగారు నివ్వెరపడిపోయారు. పదిహేనేళ్ళ సాంసారిక జీవితంలో పార్వతమ్మ నాలుగు వాక్యాలు యిలా ఏక బిగిన మాట్లాడడం ఆయనకు క్రొత్త. ఆయన కో సందేహంగూడా కలిగింది. ఇది అర్ధాంగి కోరిక మాత్రమేనా! భగవన్నిర్ణయం ఆమె నోటంట యిలా పలికించడం లేదుగదా!

ఎలాగైతేనేమి, జగన్నాథంగారు భార్య మాటను కొట్టిపార వేయలేకపోయారు. అందుకు తగ్గట్టుగా ఆశించినంతకంటే అశ్రమంగా కార్యం సానుకూలమయ్యే సూచనలు కనిపించాయి. పసివాడి తండ్రి పట్టింపులులేని మనిషి. పుట్టించినవాడు పూరిమేపడన్న విశ్వాస మొకటే అతడు తన సంతానానికి గడించి పెడుతున్న ఆస్తి. అతడు కిమ్మనకుండా జగన్నాథంగారి అభ్యర్థపైన తన ఆమోద ముద్రను వేసేశాడు. తన మనుమళ్ళలో ఒకడికి పుట్టగానే సిరి పట్టుకున్నందుకు పుల్లమ్మకు పరమానందమే కలిగింది. ఇక తల్లి గంగలో దూక మన్నా తన మేలుకే ననుకునే రాజమ్మ తన బిడ్డను విడనాడుకోవ డానికి సమ్మతించడంలో ఆశ్చర్య మేముంది?

కాని పాలుత్రాగుతున్న బిడ్డను తల్లినుంచి వేరుచేయడం

న్యాయం కాదనిపించింది జగన్నాథంగారికి! బిడ్డ తమవాడే ననుకున్న తర్వాత అందాకా ఓపికపట్టడానికి పార్వతమ్మకైనా అభ్యంతరం లేక పోయింది.

రెండు మూడు నెలల కొకసారి జగన్నాథంగారు మారేడు పల్లికి వచ్చి బిడ్డను చూస్తుకుని వెళ్ళేవారు. వచ్చినప్పుడల్లా ఓపినన్ని తినుబండారాలు, ఆటవస్తువులు పట్టుకొచ్చేవారు. లౌకిక వ్యాసంగాల నన్నింటిని మరచి కాసేపు పిల్లలతో ఆడుకునేవారు. క్రిస్మస్ పండుగకు కానుకలు తీసుకొచ్చే గడ్డం తాతయ్యను గురించి మారేడుపల్లి పిల్లలకు తెలియదు. ఆయనకు బదులుగా వాళ్ళు జగన్నాథంగారిని ఎరుగుదురు. అదైనా జగన్నాథంగారని కాదు: పట్నం మామయ్యగా ఎరుగుదురు.

ఏడాది గడిచేసరికి చిట్టిబాబు పాలు మరిచిపోయాడుగాని తల్లి ఒడిని మాత్రం వదిలిపెట్టలేకపోయాడు. జగన్నాథంగారు చేతుల్లోకి తీసుకుంటే వాడు గిలగిలలాడి పోయేవాడు. ఏదో ఒక విపరీతశక్తి జగన్నాథంగారి రూపంలో వచ్చి తన నొక బందిఖానాలోకి తీసుకెళ్ళిపోనున్నదన్న ఊహ, కాకపోతే భ్రమ, వాడి లేత బుర్రలో చోటు చేసుకుంది. జగన్నాథంగారి గొంతు వినిపిస్తేచాలు వాడు జడుసుకునేవాడు! వాడిలో ప్రాతికూల్యం పెరిగినకొద్దీ తమ పంతాన్ని తాము నెగ్గించుకోవాలన్న పట్టుదల జగన్నాథంగారిలో చెలరేగక పోలేదు. కాని అందువల్ల పరిస్థితి మరింతగా విషమించవచ్చు నని మాత్రమే అనిపించింది. చిట్టిబాబుకు నాలుగోయేడు జరుగుతుండగా జగన్నాథంగా రొకసారి వాడిని బలవంతంగానైనా సరే, తమతో తీసుకెళ్ళి పోదలచుకున్నారు. పల్లెనుంచి మూడు ఫర్లాంగులదూరం వెళ్ళేసరికి చిట్టిబాబు జగన్నాథంగారిని మూడుచెరువుల నీళ్ళు త్రాగించాడు. గోళ్ళతో గోకి, రక్కి చివరకి ముంజేతిపైన నెత్తురు కాట్లు వేసి వాడు యింటికి పారిపోయి వచ్చేశాడు. ఆ రోజు రాత్రి వాడికి జ్వరం వచ్చింది. వచ్చిన జ్వరం నాలుగు రోజులవరకూ మన్నూ మిన్నూ తెలియకుండా కాసింది. బిడ్డ తమకిక దక్కడనే అను

కున్నారు. లోకంలో నూక లింకా బాకీ వుండబట్టి చిట్టిబాబు మళ్ళీ బ్రతికి బట్టగట్టాడు.

మరి కొంతకాలం ఓపికపట్టడ మొకటే జగన్నాథంగారికి గత్యంతరమైంది.

చూస్తూండగానే చిట్టిబాబుకు ఎనిమిదే ళ్ళొచ్చేశాయి....

గడచిన గాథలోనుంచి జగన్నాథంగారు ప్రస్తుత ప్రపంచంలోకి వచ్చిపడేసరికి గంట తొమ్మిది గావచ్చింది. పెద్ద మనుషులు కొందరు లాంతరులు చేతబట్టుకుని చిట్టిబాబుకోసం వెదకుతున్న దృశ్యాన్ని ఆయన గమనించక పోలేదు. వాళ్ళ అన్వేషణకు ఫలితంగా రాత్రి పదిగంటల ప్రాంతంలో చిట్టిబాబు దొరకనే దొరికాడు.

ఊరి ముందర బావిదగ్గర సున్నపుగూడు చాటున నక్కి కూర్చున్న చిట్టిబాబుకు అక్కడికక్కడ వేడివేడిగా నాలుగు చురకలు లభించాయి. ఇంటికి తెచ్చి పడేశాక పుల్లమ్మ దగ్గరనుంచి పుష్కలంగా తిట్లుగూడా లభించాయి.

## 2

షష్టిపూర్తి వేరు; ఇష్ట పరిపూర్తి వేరు. మొదటిది చాలామంది విషయంలో సంభవమేగావచ్చు; రెండోది మాత్రం గగన కుసుమమే. ఇందుకు జగన్నాథంగారి కథ నికరమైన నిదర్శనం.

షష్టిపూర్తి జగన్నాథంగారు తమంతట తామే మనసుపడి తీర్చుకున్న ముచ్చటగాదు. అందుకు కారకులైనవా రిద్దరు: ఒకడేమో యింజనీరు మాధవరావు; రెండో వ్యక్తి డాక్టరు నారాయణ. కృతజ్ఞతా భారం ఒక మోయరాని ముల్లె. ఆ ముల్లెలో కొంతకు కొంతైనా తగ్గించుకోవాలన్న కోరిక మానవుణ్ణి ఒక పట్టాన వదిలిపెట్టదు. రామజోగిగారి నాటు బడిలో అయిదో తరగతి వరకు చదువుకుని పొలాల వెంట తిరుగుతున్న ఈ కుర్రవా ళ్ళిద్దరూ ఉన్నత విద్యాభ్యాసం వల్ల రాణించగలరని పసిగట్టినవారు జగన్నాథంగారే! ఈ సదుద్దేశం సుక్షేత్రంలో అదనుకు పడిన వానలా ఆ కుర్రవాళ్ళ భవిష్యత్తుకు ఘంటాపథాలు వేసింది.

వాళ్ళ ఉన్నత విద్యాభ్యాసంపట్ల తల్లిదండ్రులు చూపిన శ్రద్ధ చాలా తక్కువ. జగన్నాథంగారి పూనికవల్ల వాళ్ళు హైస్కూల్లో చేరారు. హాస్టల్లో వుండి చదువుకున్నారు. తమ కే అవసరం వచ్చినా వాళ్ళు జగన్నాథంగారితో చెప్పుకునేవారు. ఆ అవసరం నిమిషాల్లో పరిష్కరింపబడేది.

పుట్టిన నేల, పారగడుతున్న నీరు, చుట్టూరా వేసిన కంచె ఒక్కటే అయినా తోటలో ఒక్కొక్క చెట్టు ఒక్కొక్క రకంగా పెరగడం అనుభవానికి అందుబాటులో వున్న విషయమే! జగన్నాథంగా రొక తోటను పెట్టారు. కొన్ని మొక్కల్ని తామే తీసుకురాగా, మరికొన్ని మొక్కలు తామే ఆయన్ను వెదుక్కుంటూ వచ్చాయి. శక్తివంచన లేకుండా ఆయన అన్నింటికీ దోహదక్రియలు చేశారు. కాని చదువులోనైనా బడిలో చేరిన వా ళ్ళందరూ నెగ్గుకొస్తారన్న నమ్మక మేముంది? అలాంటి వాళ్ళ కాయన ఏవో వృత్తి విద్యలు చూపెట్టారు. ఒకడు మోటార్ల కంపెనీలో రిపేర్లు నేర్చుకున్నాడు. మరొకడు సంగీతసాధన చేసి గాయకుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇద్దరు సైన్యంలో చేరారు. ఉపాధ్యాయ వృత్తి మరికొందరికి ఆశ్రయ మిచ్చింది. జగన్నాథంగారి షష్టిపూర్తికి పేరు పేరునా అందరికీ ఆహ్వానాలు వెళ్ళాయి.

ఆ విధంగా ఆహ్వానం అందుకున్నవాళ్ళలో జగన్నాథంగారు గూడా ఒకరు!

పసుపుకుంకుమల చిలకరింపుతో ఓ కవరు కనిపించగానే జగన్నాథంగారు ఎవరికో పెళ్ళి కాబోలు ననుకున్నారు. "ఇదిగో. పార్వతీ! ఎవరిదో పెళ్ళి పత్రిక వచ్చింది" అంటూ ఆయన హాల్లోకి వెళ్ళారు.

వంటింట్లోనుంచి పార్వతమ్మగూడా ఎదురుగా వచ్చేసింది— "పెళ్ళా! ఎవరికి చెప్మా, ఒకవేళ మన రఘుపతికేమోనండీ! అబ్బే, అయివుండదు. వా డింకా రెండేళ్ళు పెళ్ళి చేసుకోనన్నాడుగా! అయితే సుధాకరుడికేమో! అవునవును. వాడికే అయివుండాలి...."

తీరా కవరులోనుంచి కార్డు పైకి తీసిన తర్వాత అసలు విషయం తేట తెల్లమైంది. జగన్నాథంగారు ఒక నిమిషంపాటు నోట మాటరాక నిర్ఘాంతపడి వుండిపోయారు.

"ఏమిటండీ అలా అయిపోయారు! ఎవరికి పెళ్ళి?" అంటూ దగ్గరికి వచ్చి పార్వతమ్మ పత్రికను తానే చదువుకుంది.

"మనతో ఒక్క మాటైనా చెప్పకుండా ఎంతపని చేశారో చూశావా పార్వతీ!" ఆ ఒక్క మాట మాత్రం అన్నారు జగన్నాథం గారు. అందిన శుభవార్త పైన వ్యాఖ్యానించడానికి పారతమ్మ కా మాత్రం మాటలైనా స్ఫురించాయిగావు.

ఆ భార్యాభర్తల మధ్య అరగంటసేపటివరకు మౌనమే తాండవించింది.

"ఐతే ఎక్కడ జరుపుతా రటండీ?" వంటింట్లోనుంచి ప్రశ్నించింది పార్వతమ్మ.

ఈ క్రొత్త వివరంకోసం మళ్ళీ ఒకసారి పత్రికను పరామర్శించారు జగన్నాథంగారు: "అందులోను ప్రత్యేకత లేకపోలేదు పార్వతీ! ఏడుకొండలవాడి సన్నిధానంలోనట. వైశాఖ శుద్ధ ద్వాదశి నాటికి అందరూ కొండపైకి చేరుకోవాలట!"

ఏబదేళ్ళ పార్వతమ్మ ఉక్రోషంతో అయిదేళ్ళ పసిపాపే అయిపోయింది! "అలాగైతే అంతా వాళ్ళ యిష్టమేనటండీ! మెప్పకైనా మనతో ఒక మాట చెప్పనక్కర్లేదా! అలాగైతే మనం వెళ్ళనే వెళ్ళొద్దు. ఏం చేస్తారో చూద్దాం."

జగన్నాథంగారు ఒక్క పెట్టున నవ్వేశారు. "నీ బింకం సంగతి నాకు తెలియదా పార్వతీ! తీరా వెంటబెట్టుకుని వెళ్ళడానికి ఎవరైనా వస్తే, తొందరగా పెట్టే బేడా సర్దుకునే దానివి గూడా నువ్వే!...."

మీ మాటలతో నా కేమి లెద్దురూ—అన్నట్టు పార్వతమ్మ మారు మాటాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. ఈసారి మధ్యాహ్న భోజనాలవరకూ భార్యాభర్తల మధ్య మౌనమే నెలకొన్నది. భోజనం వడ్డిస్తూ ఉపక్రమించింది పార్వతమ్మ.

"ఏమండీ! మంచిదో చెడ్డదో సంబరమంటూ ఒకటి జరుపు తున్నారుగదా! దీనికైనా చిట్టిబాబు లేకపోతే ఎలాగండీ!"

"చిట్టిబాబు తప్పకుండా వుండవలసిందే! కాని చిట్టి బాబనే వా డేమైనా ఒక వస్తువా పార్వతీ! వస్తువైతే ఆర్లునూర్లయినా వెచ్చించి తెచ్చుకోవచ్చు. వా డెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో మన కేం తెలుసు! లేదంటే 'తిరిగి రావాలి!' అంటూ పత్రికల్లో ఒక ప్రకటన వేయించమంటే అందుకు నేను సిద్ధం."

భోజనానికి కూర్చునేటప్పటికి జగన్నాథంగారికి ఆకలిగా వున్న మాట నిజమే! కాని చిట్టిబాబు ప్రస్తావన వచ్చేసరికి అన్నం తినబుద్ధి పుట్టిందిగాదు. చిట్టిబాబు వ్యవహారం ఆ భార్యా భర్తల పాలిటికి ఎదలో ముల్లులాగా పరిణమించడం ఈనాటి మాటగాదు. చిట్టిబాబనే ముడి పదార్థంనుంచి ఓ అద్భుతవ్యక్తిని తయారుచేయాలనుకున్నారు జగన్నాథంగారు. వాడి మూలంగా సంతానంలేని వెలితి తీరుతుందను కుంది పార్వతమ్మ. ఆ ఆశలు అడియాసలే అయ్యాయి. మూడు రోజుల కొకసారి స్నానం, ముతక బియ్యపు అన్నం, చెప్పినపని సరిగా చేయకపోతే పుల్లమ్మ చేతులో పిడిగుద్దులు, రారమ్మని వాళ్ళు-పోపొమ్మని వీళ్ళు ప్రాధేయపడినా పీడలాగా పట్టుకుని వదలనందుకు పదిమందిలో ఛీత్కారాలు—యింతకుమించి పల్లెలో చిట్టిబాబుకు లభ్యమయ్యే సన్మానాలు లేవు. చతుర్విధోపాయాలు అవలంబించి పన్నెండేళ్ళ ప్రాయంలో చిట్టిబాబును మొదటిసారిగా పట్టణానికి తీసు కెళ్ళారు జగన్నాథంగారు. నిద్రలేవగానే స్నానం, వెనువెంటనే ఉపాహారం, మడత చెరగని చలువబట్టలు, మధ్యాహ్నం బడికే భోజనం, సాయంకాలమైతే యింటి వెనుక తోటలోనే ఆటలాడుకునే సదుపాయం, పడుకోడానికి మెత్తటి పరుపు, పైన గిర్రున తిరిగే ఫ్యాను! కలలోనైనా వూహించి ఎరుగని ఈ సౌఖ్యాలను ఒకసారి చవిచూస్తే నగరవాసంపట్ల చిట్టిబాబుకు ప్రలోభం కలగవచ్చుననే అందరూ ఆశించారు. కాని, వచ్చిన సిరికి మోకా లడ్డం పెట్టేశాడు చిట్టిబాబు. ముళ్ళమీద కూర్చున్న వాడిలా మూడుమాసాల కాలం

అత డెలాగో వేగించాడు. ఓ రోజు తెల్లవారేసరికి వాడింట్లోలేడు. పట్టణమంతా గాలించినా కనిపించలేదు. నాలుగు రోజుల తర్వాత వాడు పట్టణంలో మునిగి, పల్లెలో తేలాడన్న వర్తమానం తెలిసింది. జగన్నాథంగా రీసారి అదనంగా మరికొంత జాగ్రత్త తీసుకున్నారు. తప్పిదాన్ని మన్నించి మళ్ళీ ఈసారి చిట్టిబాబును తాను పట్టణానికి తీసుకెళ్తున్నాడు. కాని యింకొకసారి యిలా చేస్తే వాణ్ణి పల్లెలోకి రానివ్వకూడదు. ఈ షరతుకు పుల్లమ్మ ఒప్పుకోలును వ్యక్తపర చింది. చిట్టిబాబు నగర జీవితంలో రెండో అధ్యాయం ప్రారంభ మైంది. అది కొనసాగింది కూడా చాలా తక్కువ కాలమే! మళ్ళీ పల్లెలో ప్రత్యక్షమయ్యాడు చిట్టిబాబు. పుల్లమ్మ మండిపడింది. తల్లి వాడి ముఖమైనా చూచిందిగాదు. ఊరి పొలిమేరలదాకా వాడిని తన్ని తరిమివేయడం జరిగింది. ఆ దెబ్బతో చిట్టిబాబు అయిపు లేకుండా అంతర్ధానమయ్యాడు. ఆరుమాసాల తర్వాత వాడు అంబా సముద్రం బస్‌స్టాండ్‌లో కనిపించాడని చూచిన వాళ్ళెవరో జగన్నాథంగారికి కబురుపెట్టారు. ఆయన పని గట్టుకుని అంతదూరం వెళ్ళారు. వెది కించి చిట్టిబాబును మళ్ళీ స్వస్థలానికి పట్టి తెచ్చారు.

చివరికిది ఎడతెగని ప్రయత్నాలతో విక్రమార్కుడు బేతాళుణ్ణి మూపున మోసితెచ్చిన కథలాగా పరిణమించింది.

మొదటిసారి గ్రహపాటుగా జరిగిన పొరపాటు చూస్తూండ గానే చిట్టిబాబు కొక అలవాటు క్రిందికి వచ్చేసింది. ఎంతగా నిగా వేసివుంచినా వాడిని హద్దుల్లో అట్టిపెట్టడం అసాధ్యమైపోయింది. చేతికి దొరికిన డబ్బును జేబులోవేసుకుని వాడు దేశంపైకి పారిపో సాగాడు. తెచ్చుకున్న డబ్బు ఖర్చయిపోతే తక్షణం మరికొంత పంప వలసిందని నిర్దాక్షిణ్యంగా జగన్నాథంగారి కొక కార్డు ముక్క వ్రాసి పడేసేదాకా వాడిలో కర్కశత్వం విజృంభించింది. మాటిమాటికీ యిలా డబ్బు పంపుతూ రావడం చిట్టిబాబు మరింతగా చెడిపోవడానికి మాత్రమే ఉపకరించగలదని జగన్నాథంగారు అనతికాలంలోనే

గ్రహించారు. పంపడం మానుకున్నారు. అప్పుడిక చిట్టిబాబుకు మిగిలినవి రెండేగత్యంతరాలు: ఒకటి కాయకష్టం; రెండోది హస్త లాఘవం. చిట్టిబాబు రెండోదానికే ఒడబడ్డాడు. ఈచేతిపట్టు పనితనం వల్ల వాడు ప్రభుత్వం వారికి అతిథిగా అడపాదడపా కృష్ణ జన్మ స్థానంలో కాలం గడపవలసి వచ్చింది.

మొత్తంమీద జగన్నాథంగారి జీవిత వాతావరణంలో చిట్టిబాబు ఓ సుడిగాలిలాంటివాడుగా తయారయ్యాడు. వాడు ఎప్పుడొస్తాడో తెలియదు. రాకుండా మాత్రం వుండడు. వచ్చిన తర్వాత ఈనాడో రేపో పరారీ గిత్తగించడం ఎంత ఖాయమో, ఎంతో కొంత సంగ్రహించుకుని వెళ్ళడం కూడా అంతే ఖాయం!

ఇలాగే పదేళ్ళు గడిచిపోయాయి.

ఈ పదేళ్ళ పొడుగునా జగన్నాథంగారిని ఎదుర్కొని నిరుత్తరంగా వుండిపోయిన ప్రశ్న ఒక్కటే. చిట్టిబాబు ఎందుకిలా తయారయ్యాడు? మానవుడికి సుఖశాంతులకంటే కావలసినవేమున్నాయి? వాటిని కాలదన్ని చిట్టిబాబు ఆగమ్మ కాకిలా ఇలా దేశంపైన తిరుగుతున్నాడంటే అందుకు కారణమేమిటి? లోపం ఎక్కడుంది?

షష్టిపూర్తికి ఆహ్వానం అందిననాటి సాయంకాలం ఈ ప్రశ్నకొక సరిక్రొత్త సమాధానంతో భర్త సమక్షానికి వచ్చింది పార్వతమ్మ.

"ఏమండీ, ఓ మాటడుగుతాను మిమ్మల్ని! మొక్కుబడి చెల్లించు కోకపోతే దేవుడికి కోపంరాదూ?"

"రావచ్చునేమో. భగవంతుడి యింగితం మన కెలా తెలుస్తుంది పార్వతీ?"

"సంతానం లభ్యమైతే బంగారంతో బొమ్మ చేయించి హుండీలో వేస్తామని మ్రొక్కుకోలేదటండీ! ఒకవేళ ఆ మాట మనం మరచిపోయినా, భగవంతుడు మాత్రం మరచిపోయి వుండడు...."

“భగవంతుడి జ్ఞాపక శక్తిపైన నీ కామాత్రం నమ్మక మున్నందుకు చాలా సంతోషం.”

“మీ ఎగతాళి మాటలకేం గానీండి. ఎలాగూ మనం కొండకు వెళ్తున్నాము. పనిలో పనిగా మొక్కుబడి కూడా చెల్లించేయాలి....”

“ఇప్పుడు నేనొద్దన్నానా పార్వతీ! అలాగే కానిద్దాం. నాలుగు రోజుల్లో బొమ్మ చేయించి తీసుకొచ్చే భారం నాది....”

“ఎందుకు చెబుతున్నానంటే—ఆ మొక్కు కాస్తా చెల్లించు కునేదాకా చిట్టిబాబుకు బుద్ధి కుదరదేమోనండీ.”

జగన్నాథంగారు తెల్లబోయారు—“అలాగైతే చిట్టిబాబుకు బుద్ధి కుదరవచ్చునని నీ కింకా నమ్మకముందా పార్వతీ?”

“దేవుడు దయదలిస్తే అదెంత పనండీ?”

పై అధికారుల అనుగ్రహానికి మల్లే భగవంతుడి అనుగ్రహం కూడా యిచ్చకపు మాటలపైన, మెరమెచ్చు గౌరవాలపైన, ఇచ్చి పుచ్చుకోడాలపైన ఆధారపడి వుంటుందన్న విషయంపై జగన్నాథం గారికి నమ్మకంలేదు. ఐనా భార్య సంతృప్తికోసం ఆయన పది తులాల బరువుతో ఓ పుత్తడి బొమ్మను తయారుచేయవలసిందని కంసాలికి పురమాయించారు.

ఆ బొమ్మ యింటికివచ్చిన వేళా విశేషమేమిటోగానీ, దానితో బాటుగా చిట్టిబాబుకూడా యింట్లో కాలు పెట్టాడు.

“నే చెప్పలేదటండీ! అంతా ఏడుకొండలవాడి దయ” అంది పార్వతమ్మ.

వైశాఖ శుద్ధ దశమినాటి రాత్రి ఎనిమిది గంటలకు జగన్నాథం దంపతులు చిట్టిబాబుతో సహా తిరుపతిలో దిగారు. మాధవరావు, నారాయణ, ఇంకా మిగిలిన కార్య నిర్వాహకులూ స్టేషనులోనే వాళ్ళకు స్వాగత మిచ్చారు.

"మనం రిజర్వు చేయించుకున్న బస్సు ఉదయం ఏడుగంటలకే బయల్దేరుతుంది. ఆరుగంటలకల్లా మనం ప్రయాణానికి సిద్ధంగా వుండాలి...." అన్నాడు నారాయణ.

మాధవరావు అందుకున్నాడు—"సత్యనారాయణ రాత్రి పన్నెండు గంటలబండిలో వస్తున్నట్టు వ్రాశాడు. రామమూర్తి కూడా అదేబండిలో రావచ్చునని అనుకుంటున్నాము. పోతే తెల్లవారు జామునకూడా బళ్లున్నాయి. మారేడు పల్లినుంచి ఎవరైనా వస్తే ఆ బళ్ళలో రావచ్చు. అన్నట్టు మాష్టారూ, రేపురాత్రికి బహుశా మీకు నిద్రవుండకపోవచ్చు. ఈ రోజురాత్రి బాగా రెస్టు తీసుకోడం మంచిది...."

ఎంతగా తొందరపడినా అందరూ పడుకునేసరికి అర్ధరాత్రి దాటింది. మండుటెండల తాలూకు వేడిగూడా అప్పటికి పూర్తిగా చల్లారింది. శేషాచలం సానువుల్లోంచి చల్లనిగాలి తెమ్మెరలు తెమ్మెరలుగా వచ్చి తిరుపతి నగరం పైన వింజామరాలు వీచింది.

అందరిలోనూ ముమ్మందుగా నిద్రలేచిన వ్యక్తి పార్వతమ్మ.

ఆమె ఐదు గంటలకే లేచింది. గదిలోకి వెళ్ళి ముఖ ప్రక్షాళనాదికాలు ముగించుకుని తిరిగివస్తూ చిట్టిబాబు కోసం చూచింది. వాడు గదిలోలేడు. వరండాలోనూ కనిపించలేదు.

"ఏమండీ. చిట్టిబాబు ఎక్కడ పడుకున్నాడు?" రహస్యంగానే అడిగింది పార్వతమ్మ.

"గదిలో పడుకున్నాడుగా! నువు గమనించలేదా పార్వతీ?"

"ఏదీ? గదిలో లేడే!"

భార్యా భర్తలిద్దరూ గది లోపలికి వచ్చారు. వచ్చీరాగానే జగన్నాథంగారి కళ్లు ట్రంకుపెట్టె పైకే వెళ్ళాయ్. దాన్ని బలవంతంగా తెరిచిన సూచనలు బాహాటంగానే కనిపిస్తున్నాయి.

"కొంపదీసి డబ్బంతా పెట్టెలోనే వుంచేశారేమిటండీ?" గుండెలు కొట్టుకుంటూవుండగా అడిగింది పార్వతమ్మ.

"మరేం కంగారుపడకు పార్వతీ, డబ్బు నా జేబులోనే వుంది"- కాని మరుక్షణాన జగన్నాథంగారి ముఖంలో గూడా కలవరపాటు ప్రారంభమైంది. "అన్నట్టు బంగారపు విగ్రహం మాటేమిటి పార్వతీ? అది పెట్టెలోనే వుండాలి ..."

జగన్నాథంగారు ఆదరాబాదరా పెట్టెను తెరిచిచూశారు. అనుమానం కాస్తా నిజమై వూరుకుంది. పెట్టెలో బొమ్మలేదు.

ఆపాటికి వరండాలో మేలుకొలుపులు ప్రారంభమయ్యాయి- "ఒరేయ్ సత్యం. ఏమిట్రా రామ్మూర్తీ! లేవండి, లేవండి. తెల్లవారడాని కింక అట్టే వ్యవధి లేదు...."

గది తలుపులు మూసివచ్చి కుర్చీలో కూర్చున్నారు జగన్నాథంగారు. "పోతే పోయిందిలే పార్వతీ. ఆ వస్తువు పోయిందని ఎవరితోనూ చెప్పకోవద్దు. కడుపు చించుకోడమెందుకు, అది కాళ్ళ పైనపడటమెందుకు? భగవంతుడి కెందుకో దాన్ని స్వీకరించడం యిష్టం లేదనుకుందాం...."

"మనల్ని మనం ఓదార్చుకోవడం కాకపోతే, భగవంతుని కెందుకు యిష్టం లేక పోతుందండీ?"

"అదంతే ననుకో రాదా పార్వతీ! కాకపోతే మిగిలిన వస్తువులన్నీ వుండగా ఆ విగ్రహమే ఎందుకు పోవాలి? మరొకవిధంగా చెబుతాను. మనం ఎందరినో చేరదీశాము. అందరిలోనూ ఒక్క చిట్టిబాబు మాత్రం ఎందు కిలా కావాలి?"

"అంతా వాడి కర్మ!"

"వాడి కర్మతో నైతే మనకు ప్రసక్తి లేదు. నేను చెబుతున్నది మన తప్పిదాన్ని గురించి...."

"మీ పిచ్చిగాకపోతే మనమేం తప్పు చేశామండీ!"

"మాధవుడు యింజనీరవుతాడని మనం అనుకోలేదు. కావాలని ఆశించనూ లేదు. అలాగే నారాయణ డాక్టరౌతాడనిగానీ, కావాలనిగానీ ఊహించలేదు. కాని చిట్టిబాబు మాత్రం ఏదో పెద్ద కొండలకు నిచ్చెన వేస్తాడనీ, త్రవ్వి తలకెత్తుతాడనీ అనుకున్నాము. అవునా పార్వతీ?"

"ఆశించడం గూడా తప్పేనటండీ?"

"మనం ఒక వ్యక్తి పైన పెద్దగా ఆశలు పెట్టుకుంటామనుకో! అవి నెరవేరితేనే ఆనందం. నెరవేరకపోతే ఎదురయ్యేది తీరని దుఃఖం. ఇందుకు విరుద్ధంగా ఒక వ్యక్తి పైన మన కెలాంటి ఆశలూ లేవనుకో! అయాచితంగా అవి నెరవేరితే ఆనందించక పోము. కాని నెరవేరక పోయినా ఆశాభంగం చెందము. గాఢమైన మమకారాలు, తీవ్రమైన అనుబంధాలు దుఃఖ హేతువులనడం ఇందువలననే!"

"ఏమిటో బాబూ! మీ వేదాంతం మాటలు నా కర్థం గావు...."

"వేదాంతమనేది జీవితానికి సజావైన వ్యాఖ్యానమైతే, దాన్ని మనం త్రోసిపుచ్చడం భావ్యమంటావా పార్వతీ? ఔషధం చేదుగావున్నా పుచ్చుకోక తప్పదు. 'ధర సింహాసనమై నభంబు గొడుగై .... బ్రహ్మాండ మాకారమై' అంటూ భగవంతుడి మహత్యానికి తగ్గట్టుగా ఆయన కొక రూపాన్ని, నివాసాన్ని నిర్ధారణ చేశాడు మానవుడు. ఆ భగవంతుడి ఏలుబడిలో సర్వ మానవులూ సమానులేనన్న అభిప్రాయం కలిగింది. కాని కాలక్రమేణ ఆ దేవుణ్ణి గూడా తమ స్థాయికి దిగలాగి ఎవరికి తోచినట్టుగా వాళ్ళు పేర్లు, ఆకారాలు, మందిరాలు నిర్మించుకోవడంతో ఏమైంది? రచ్చలు, రగడలు

ప్రారంభమయ్యాయి. ఊహ విశాలం కావడంలోనూ, కాకపోవడం లోనూ వున్న లాభనష్టాలని, ఈ లోకమంతా మనదే అయినప్పుడు, మానవులందరూ ఆత్మబంధువులే అయినప్పుడు మనం మన అను బంధాలను, మమకారాలను ఒక స్థలానికి, ఒక వ్యక్తికి పరిమితం చేసుకోవలసిన దౌర్భాగ్యమేముంది? కంబళి పురుగుంది చూచావా పార్వతీ? అది కదిలీ మెదలడానికైనా వీలులేనట్టుగా ఒక గూడు కట్టుకుని అందులో నిద్రపోతుంది. ఆ గూటిని పెకలించుకుని బయటపడిన తర్వాతనే గాని, ఆ కంబళి పురుగు సీతాకోక చిలుకగా మారి సువిశాల జీవితోద్యాన వనంలో విహరిస్తూ ఆనంద మకరందాన్ని గ్రోలడంలేదు. గిడసబారిన బుద్ధితో, సంకుచిత హృదయంతో యిరుకుగోడల మధ్య మురికిగా బ్రతకడమెందుకు పార్వతీ?"

పదిహేను నిమిషాలవరకూ స్తబ్ధురాలై కూర్చుండిపోయింది పార్వతమ్మ. ఆ తరువాత ఆమె వున్నట్టుండి పైకి లేచింది. ఎంతో సేపు ఆకల్లాడకుండా స్తంభించి వుండిపోయిన పొన్నచెట్టు హఠాత్తుగా వీచిన దక్షిణానిలంలో పులకరించినట్టుగా, తలపైనుంచీ కొండంత బరువును దించివేసిన తరువాత శరీరం తేలికపడ్డట్టుగా ఆమె లేచింది. మెల్లిగా వరండాలోకి వచ్చి స్తంభానికి ఆనుకుని నిల్చుంది. ఇంకా తెల్లవారినట్టులేదు. కొండ మెట్లను వెన్నంటి వున్న విద్యుద్దీపాలు వెలుగుతూనే వున్నాయి. తెల్లవారకేమి? గోవింద రాజస్వామి గుడిగోపురం పైని కనకకలశాలు వికసిస్తున్న పద్మాలను తలపిస్తున్నాయి.

బస్సు బయల్దేరడానికి సిద్ధంగా వుందని చెప్పడానికి వచ్చిన నారాయణ పార్వతమ్మను చూచి పది బారల దూరంలో ఆగిపోయాడు. వచ్చిపోతున్న మసకచీకటి తెరల్లోంచి ఆమె ముల్లోకాలకు కన్నతల్లి అయిన అలిమేలు మంగమ్మలా కనిపించింది! *